# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు మరికొద్దిసేపట్లో పోలింగ్ ప్రారంభం కానుంది.**
2. **ఆంధ్రప్రదేశ్ లో ఆలయాల అభివృద్ధిపై ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **తెలంగాణలో చేపడుతున్న ప్రాజెక్టులకు సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషా కోర్సులు ప్రవేశపెట్టే అంశాలను పరిశీలించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు.**
5. **శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో సహాయక చర్యలు పూర్తి చేస్తామని తెలంగాణ రహదారులు భవనాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.**

**=============================**

ఆంధ్రప్రదేశ్‌లోని రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఈరోజు ఎన్నికలు జరుగుతున్నాయి. గుంటూరు- కృష్ణా, ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు, విశాఖ-విజయనగరం, శ్రీకాకుళం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఓటింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారుల వెబ్ కాస్టింగ్ చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 6 లక్షల 62 వేల 100 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా.. ఎన్నికల ఏర్పాట్లపై కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్.. 26 సెకన్లు

---------------------------

తెలంగాణలోని ఎమ్మెల్సీ స్థానాలుకూ ఈరోజు పోలింగ్ జరగనుంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. దీంతోపాటు ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయుల స్థానానికి ఈ పోలింగ్ జరుగుతుంది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు 24 జిల్లాల పరిధిలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. రెండు ఉపాధ్యాయులు, ఒక పట్టభద్రుల స్థానానికి నిర్వహించే

ఈ ఎన్నికల కోసం ప్రతి 16 కిలోమీటర్లకు ఒకటి చొప్పున 969పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆలయాల అభివృద్ధిపై ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా నంబూరులో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రాధ్యాన్యతనిస్తూ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. దేవాలయాల పటిష్టత కోసం అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్... 26 సెకన్లు

---------------------------

ఢిల్లీలో పర్యటిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి నిన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలం సొరంగం ప్రమాద ఘటనను ప్రధానమంత్రికి వివరించారు. తెలంగాణలో చేపడుతున్న పలు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. విభజన చట్టంలోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్రానికి అన్నివిధాలుగా చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశ అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, 5 ప్రధాన అంశాలపై విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్ కమ్ రైలు ప్రాజెక్టు, డ్రైపోర్టు, రక్షణరంగ ప్రాజెక్టులకు సహకరించాలని కోరినట్టు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషా కోర్సులు ప్రవేశపెట్టే అంశాలను పరిశీలించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి నర్సింగ్ విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా.. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి విదేశీ భాషా కోర్సులు ప్రవేశపెట్టాలని ఆరోగ్యశాఖ ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు.

---------------------------

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనం మహాకుంభమేళా నిన్నటితో ముగిసింది. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో 45 రోజుల పాటు జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఇప్పటివరకు 66 కోట్ల 21 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారని అధికారులు తెలిపారు. మహాకుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా, పలువురు విదేశీ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు పవిత్ర సంగమంలో స్నానాలు ఆచరించారు.

---------------------------

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో సహాయక చర్యలు పూర్తి చేస్తామని తెలంగాణ రహదారులు భవనాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నిన్న మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ సమగ్ర ప్రణాళికతో సొరంగం పూడికలోకి వెళ్లాలని నిర్ణయించామన్నారు. రెండు రోజుల్లో సహాయక చర్యలను పూర్తి

చేస్తామని మంత్రి తెలుపుతూ..

వాయిస్..36 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా నిన్న పాగాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి నాడు శ్రీశైలంలోనే ఉండే ప్రత్యేక ఆచారమైన పాగాలంకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అర్ధరాత్రి శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహించారు. వీటితోపాటు ప్రభోత్సవం, నంది వాహన సేవ ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి నేపథ్యంలో భక్తులు, శివమాలధారులతో శ్రీశైలం కిక్కిరిసింది. మరోవైపు లింగోద్భవ సమయంలో గర్భాలయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

---------------------------

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడిలో గోదావరి స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతిచెందడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో మంత్రి నిన్న బాధిత కుటుంబాలను కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఘటనకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించి రెస్క్యూ బృందాన్ని పంపించిందని తెలిపారు.

---------------------------

హైదరాబాద్‌లోని జలసౌధలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో నిన్న కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాహుల్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ అధికారులు హాజరుకాకపోవడంతో ఈరోజు మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి మే వరకు 55 టీఎంసీల నీరు కావాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించగా, మే వరకు 63 టీఎంసీల నీరు కావాలని తెలంగాణ ప్రభుత్వం కృష్ణాబోర్డును కోరింది.

---------------------------

స్వాతంత్ర్య పోరాట యోధుడు, విప్లవ సేనాని చంద్రశేఖర్ ఆజాద్ బలిదాన దినం సందర్భంగా ఈరోజు దేశ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులు అర్పిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని భవరాలో 1906 జులై 23వ తేదీన జన్మించిన చంద్రశేఖర్ యువతని స్వాతంత్ర్య పోరాటం దిశగా కార్యోన్ముఖులను చేసిన అసమాన్య స్వాతంత్ర్య యోధుడు.

---------------------------

దేశాన్ని క్షయ వ్యాధి రహితంగా మార్చేందుకు 100 రోజుల క్షయ నిర్మూలన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2024 సంవత్సరం డిసెంబరు 7 నుంచి ఈ ఏడాది మార్చి 16వ తేదీ వరకు నిర్వహించే వంద రోజుల ప్రచారంలో అనేక కార్యక్రమాలను చేపడుతోంది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 347 జిల్లాల్లో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

====================